క్లుప్తంగా

ఏసుక్రీస్తు మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సాగర్ రోడ్డులో పాస్టర్లతో కలిసి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఏసు క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చిలు, మందిరాల పాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ డీఎం చాంబర్స్‌లో ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి స్పందన లభించింది. ప్రయాణికులు ఇచ్చిన సూచనలు, సలహాలతో పాటు సమస్యలను డీఎం బొల్లెద్దు పాల్ విన్నారు. అనంతరం వారి ప్రశ్నలకు సమాధానం తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని ఉట్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అమరసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్‌లైన్ కింద ఉన్న చెట్లకొమ్మలు కొట్టేందుకు వీలుగా ఉట్లపల్లి, యాద్గార్‌పల్లి, కాల్వపల్లితండా, ఎర్రవల్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు సగం స్థానాలు ఇవ్వాల్సిందే

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు సగం స్థానాలను బీసీలకు ఇవ్వాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో కుల పాలనను కొనసాగించడం సరైంది కాదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన సగం వరకు పార్లమెంటు స్థానాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలపై వివక్ష మానుకోకుంటే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు పంపిణీ



ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లు అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ ముస్తక్ అహ్మద్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా కిట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కిట్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ హర్షం వ్యక్తం చేశారు. ముస్తక్ అహ్మద్ నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, రోహ్మాన్, నజీర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు

కొండమల్లేపల్లి : పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. మార్చి 18న ప్రారంభమైన పరీక్షలు మార్చి 30తో ముగిశాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీఎస్ సీహెచ్.శ్రీనివాసులు, ఎస్సీ గురుకుల పాఠశాల సీఎస్ రమణమ్మ, మటిల్డా హై స్కూల్ సీఎస్ సాగర్‌నాయక్, నాగార్జున గ్రామర్ స్కూల్ సీఎస్ వై.నరేందర్‌లు పర్యవేక్షలను పర్యవేక్షించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలి

నల్లగొండ టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతికాముకులు పోరాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన సంఘం జిల్లా సమితి సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ దేశాల మధ్య సోదరభావం నెలకొల్పి ప్రపంచశాంతికి పాలకులు కృషి చేయాలని అన్నారు. దేశంలో మతసామరస్యాన్ని నెలకొల్పి రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. ప్రపంచంలో ఘర్షణలకు తావు లేకుండా యుద్ధరహిత సమాజం కోసం శాంతికాముకులు, మేధావులు, అభ్యుదయవాదులు కృషిచేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట వెంకటరెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, ఉపాధ్యక్షుడు కోమటిరెడ్డి ప్రద్యుమ్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గట్టులక్ష్మీ మైసమ్మ జాతరకు వేళాయే

- ఏప్రిల్ 3నుంచి జాతర ప్రారంభం
- వివిధ గ్రామాల నుంచి తరలిరానున్న భక్తులు
- మూడు రోజుల పాటు వైభవంగా జాతర

చింతపల్లి : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన శ్రీ గట్టులక్ష్మి మైసమ్మ జాతర ఉత్సవాలు ఏప్రిల్ 3తో ప్రారంభమై 5వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి, నసర్లపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన శ్రీ గట్టులక్ష్మి మైసమ్మ మాత ఆలయాన్ని 37ఏళ్ల క్రితం నిర్మించారు. అంతకుముందు ఇక్కడ చిన్న గుడి మాత్రమే ఉండేది. భక్తులు ఇచ్చిన విరాళాలతో అమ్మవారి విగ్రహాన్ని పదమూడు సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం పూర్తిస్థాయిలో జరగాల్సి ఉంది. ఈ దేవాలయం రాష్ట్ర రహదారి పక్కనే ఉండడంతో మండల ప్రజలేగాక ఇతర మండలాల ప్రజలు ఎంతో నమ్మకంతో అమ్మవారిని కొలుస్తారు. రహదారిపై వచ్చిపోయే భక్తులతో ఆలయం ఎల్లప్పుడు సందడిగా ఉంటుంది. చింతపల్లి మండల పరిసర ప్రాంతాల ప్రజలు నూతన వాహనాలను కొనుగోలు చేస్తే తప్పనిసరిగా ఈ ఆలయం వద్ద పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



దేవాలయంలో కొలువుదీరిన అమ్మవారు

మూడు రోజుల పాటు ఉత్సవాలు

గట్టులక్ష్మి మైసమ్మ జాతర ఉత్సవాలు ఈనెల 3 నుంచి ఈనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 3న జాతర ప్రారంభం, అమ్మవారికి ప్రత్యేక పూజలు, 4న బోనాలు, జాతర, పలహారపు బండ్లు, వనవాసం, అన్నదానం, 5న అమ్మవారి జాతర ముగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జాతర ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఆలయ నిర్మాణం, ఉత్సవాలను భక్తుల విరాళాలతో ఏటా ఘనంగా నిర్వహించడం విశేషం. ఉత్సవాల సందర్భంగా భజనలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవాలయ పీఠాధిపతులు దున్న ఇద్దయ్య, కురుమిద్దె జంగయ్య, పర్వతానంద స్వాములు ప్రతిష్ఠించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



ఏప్రిల్ 3 నుంచి 5 వరకు నిర్వహించనున్న శ్రీ గట్టు లక్ష్మి మైసమ్మ జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రాష్ట్ర రహదారి పక్కనే దేవాలయం ఉండడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రతి నిత్యం ఈ దేవాలయంలో అందుబాటులో ఉండి అమ్మవారికి పూజలు నిర్వహిస్తుంటాను. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– గండికోట చంద్రశేఖర్, ఆలయ పూజారి

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి డేగాట



డేగాట సందర్భంగా స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



డేగాట సందర్భంగా హోలీ ఆడుతున్న ప్రజలు

మిర్యాలగూడ : మండలంలోని సల్కునూరు గ్రామంలో స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామికి డేగాట సందర్భంగా వసంతోత్సవం(హోలి)ను శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను గ్రామంలో పదిరోజుల పాటు నిర్వహించగా స్వామివారి కల్యాణం అనంతరం ఐదు రోజులకు అమ్మవారికి, స్వామివారికి దోపు నిర్వహిస్తారు. అనంతరం గ్రామ పురవీధుల్లో శ్రీలక్ష్మీనర్సింహస్వామిని ఘనంగా ఊరేగింపు నిర్వహించినంతరం డేగాట నిర్వహిస్తారు. ఈ సమయంలో వేద పండితుల ఆధ్వర్యంలో గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒక గ్రూపు స్వామివైపు మరో గ్రూపు చెంచులక్ష్మి అమ్మవార్ల తరుపున రంగులతో డేగాల ఆడతారు. ఆ తరువాత గ్రామస్తులు వసంతోత్సవంలో రంగులు చల్లుకోనే ఆనవాయితీ అనాధికాలంగా వస్తోంది. దేశవ్యాప్తంగా హోలీ పండుగ రోజు సంప్రదాయ పద్ధతిలో రంగుల పండుగను చేసుకుంటుడగా సల్కునూరు గ్రామస్తులు మాత్రం స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను అనుసరిస్తూ హోలీ పండుగ చేసుకుంటారు. దీంతో శనివారం ఆనవాయితీ ప్రకారం గ్రామంలోని చిన్నా పెద్ద అని తారతమ్యం లేకుండా అందరు ఉత్సాహంగా హోలీని జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ గుట్టపై కొలువుదీరిన శ్రీ అలివేలు మంగ పద్మావతి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా సాగింది. ఈ వేడుకల్లో దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌లు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించింది. ఈ ఉత్సవాలను తిలకించేందుకు చింతపల్లి మండల పరిసర ప్రాంతాల ప్రజలే కాకుండా రంగారెడ్డి జిల్లా యాచారం, మాడ్గుల ఇబ్రహింపట్నం, మర్రిగూడ తదితర మండలాల ప్రజలు వేల సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవాని పవన్‌కుమార్, ఆలయ కమిటి చైర్మన్ లక్ష్మణ్, గోవర్ధన్, నర్సింహారెడ్డి, భాస్కర్, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో శనివారం ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులందరికీ ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డీఎం బొల్లెద్దు పాల్ ప్రారంభించి మాట్లాడారు.ప్రస్తుతం ఎండలు మరింత మండిపోతున్నందున ఉద్యోగులకు చల్లధనం ఇచ్చేందుకు మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిని కూడా డీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ యాదగిరి, ఆర్టీసీ సీఐ భారతీబాయి తదితరులున్నారు.

ప్రగతి మాస రథచక్రాల పురస్కారం

కండక్టర్లు అధిక ఆదాయం రూపకంగా, డ్రైవర్లు అధిక ఆయిల్ సేవ్ చేయడంతో అధిక అధాయం తెచ్చిన రెండు రంగాల ఆదర్శ ఉద్యోగులకు నగదుతో పాటు ప్రశంస పత్రాలను శనివారం ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్, సీఐ భారతీబాయి, ఎంఎఫ్ యాదగిరిల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. డిపోకు చెందిన వెంకటేశ్వర్లు, జానకిరాములు, చంద్రకళ, లక్పతి, ఫర్వీన్, జనార్ధన్, జీఎస్ నారాయణలకు ఈ పురస్కార ప్రశాంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగ, సిబ్బంది తదితరులున్నారు.



మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్

ముప్పారం యూటీని పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నిడమనూరు : సాగర్ ఎడమకాలవకు ముప్పారం వద్ద ఉన్న యూటీ (అండర్ టన్నెల్)ని ఎన్నెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ శనివారం పరిశీలించారు. సాక్షి దినపత్రికలో శనివారం ప్రమాదకరంగా ముప్పారం యూటీ అనే శీర్షికన కథనం ప్రచురితం అయింది. దీంతో స్పందించిన ఎన్నెస్పీ డీఈ గోపీనాథ్ యూటీ పరిశీలనకు వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింహను పంపించారు. యూటీ 12, 13 ఖానాల మధ్య ఇసుకను తవ్వి తీయడంతో గోతులు ఏర్పాడ్డాయి. యూటీ పరిశీలించిన అనంతరం ముప్పారంలో ట్రాక్టర్లు ఉన్న, ఇసుకను తోలుతున్నారనే వారి ఇంటింటికి తిరిగి వారికి హెచ్చరికలు జారీచేశారు. యూటీ కింద ఖానాల వద్ద పేరుకున్న ఇసుకను తవ్వి తీస్తే యూటీకి ప్రమాదం కలుగుతుందని, ఇసుక తరలించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. కట్టమరమ్మత్తుల సందర్భంగా కట్ట ఎక్కి, దిగడానికి ర్యాంపులు ఏర్పాటు చేశారని, పనుల తర్వాత వాటిని అలాగే వదిలి వేయడం వల్ల ఇసుక తోలుకునే వారికి వీలుగా మారిందని తెలిపారు.

ముమ్మరంగా ఆస్తి పన్ను వసూళ్లు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో ముమ్మరంగా ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఆస్తి పన్ను వడ్డీ రాయితీ గడువు ఆదివారంతో ముగుస్తుంది. అంతేగా ఆర్థిక సంవత్సరం కూడా పూర్తవుతుంది.దీంతో ప్రత్యేక బృందాలతో శనివారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ స్వయంగా రంగంలోకి దిగారు. ఐదు రోజులుగా బకాయిలు చెల్లించని వారి ఆస్తులను దగ్గరుండి సీజ్ చేయించారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్‌ఓ కళ్యాణి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేశ్‌కుమార్, రవి, బిల్ కలెక్టర్లు యాదగిరిఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



హాలియాలో మాట్లాడుతున్న సీడీపీఓ గంధం పద్మావతి

హాలియా : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ టీచర్లకు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బేటీ పడావో..పోషణ్ అభియాన్ కార్యాక్రమాల అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సీజన్‌లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయని అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో ఉన్న 18ఏళ్ల లోపు ఉన్న అమ్మాయిలను అబ్జర్వ్ చేయాలన్నారు. 18 ఏళ్ల లోపు వయస్సు గల బాలికలకు చదువు మాన్పించి బాల్య వివాహాలు చేసినా, బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల జరిగే నష్టాలు, విద్య యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పిల్లలకు మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తాగించాలని, పలుచని కాటన్ దుస్తులు ధరించేలా చూడాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, నాగమణి, యాదమ్మ, ఐసీపీఎస్ అధికారి రమణి, నాలుగు సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు, కార్యాలయ సిబ్బంది సైదులు, పవన్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆంజనేయులు



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు

దేవరకొండ : దేవరకొండ మున్సిఫ్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు ఎన్నికయ్యారు. శనివారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎండీ.షౌకత్ అలీ, ఉపాధ్యక్షుడిగా కర్నాటి సురేష్, సహాయ కార్యదర్శిగా వనం పుష్పలత, కోశాధికారిగా ఇడెం రవికుమార్, స్పోర్ట్స్ సెక్రటరీగా కోరె శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బొడ్డు ఆంజనేయులు, జున్ను ఇద్దయ్య, కోరె కిషన్, రమావత్ గణేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ఇడెం రవికుమార్, సపావత్, శ్రీకాంత్‌లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులను న్యాయవాదులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నెమ్మికంటి గౌరీశంకర్, డెం రామకృష్ణ, ఇంద్రవరప్రసాద్, లోహిత్‌రెడ్డి, ముస్తాక్, చెనగాని అశోక్‌గౌడ్, ఉప్పల రమేష్, వనం జగదీశ్వర్, మాడెం రాములు, వనం శ్రీనివాస్ తదితరులున్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ : దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితులు చల్లా శ్రీనివాస్, కొండా సైదులు కోరారు. శనివారం వారు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మిర్యాలగూడ మండలంలోని గూడూరు శివారులో సర్వే నం .29/6/1/1లో వంశపారపరంగా చల్లా శ్రీనివాస్ బంధువులకు చెందిన 7ఎకరాలు వ్యవసాయ భూమి ఉందని ఆ భూమిని 2017లో విక్రయించామని తెలిపారు. అందులో చల్లా శ్రీనివాస్‌కు సంబంధించి సుమారు పది గుంటల భూమి ఉందని ఆ భూమి మాదేనంటూ పట్టణానికి చెందిన రియల్టర్లు దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించారు. ఆ భూమిపై వారికి ఎలాంటి హక్కు లేదని, న్యాయపరంగా ఉంటే కోర్టులో చూసుకోవాలని సూచించామన్నారు. అయినప్పటికీ ఆ ముగ్గురితోపాటు మరో కొంతమంది దౌర్జన్యంగా భూమిపై వేసిన కడీలు, కంచెలు తొలగించారని చెప్పారు. పైగా శుక్రవారం రాత్రి హౌసింగ్‌బోర్డులోని తమ కార్యాలయంపై వారితోపాటు మరికొంతమంది దౌర్జన్యానికి దిగి దాడి చేసి గాయపరచారని తెలిపారు. జరిగిన దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులను కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

త్రిపురారం : మండలంలోని అల్వాలపాడు గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవం శ్రీ గంగా భవాని, పోతురాజు విమాన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గ్రామస్తులు శనివారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. పురోహితులు కొంకపాక రాధాకృష్ణమూర్తి వారి శిష్య బృదం ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజేంద్ర నగర్, బోర్రాయిపాలెం, చెన్నాయిపాలెం, మాటూరు, సత్యంపాడు తండా, వస్తం తండా గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుసిరెడ్డి పాండు రంగారెడ్డి సుమారు 2000 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అల్వాలపాడు గ్రామ మాజీ సర్పంచ్ చెవుల రామయ్య జానకి దంపతులు ఆర్థిక సహకారంతో గంగమ్మ గుడి నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో గంగా భవాని దేవాలయ ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక సందర్శనలో విద్యార్థులు



సాగర్ పవర్ జనరేషన్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెం, తిరుమలగిరి మండలాల నుంచి పలువురు విద్యార్థులు వైజ్ఞానిక సందర్శనలో భాగంగా శనివారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న పవర్ జనరేషన్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డ్యాం డీఈలు ప్రసన్నకుమార్, దేవేందర్‌రెడ్డిలు విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి ఎలా అవుతుంది, పనితీరు, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుందనే విషయాలను వివరించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చామకూరి రాహుల్‌రెడ్డి, రాఘవేంద్ర, జలేందర్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

వేములపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోతున్న పంట పొలాలను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరిశీలించనున్నట్లు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఈ పర్యటను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండలంలోని పలు గ్రామాలను రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి పర్యటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, ఎంపీటీసీ మేక లలిత, నాయకులు కృపాకర్ రావు, మేకల వెంకన్న తదితరులు ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి


బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా హన్మంతరెడ్డి



హన్మంతరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా తుమ్మలపల్లి హన్మంతరెడ్డిని నియమిస్తూ శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వర్షిత్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. అనంతరం నల్లగొండలో నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ భాణావత్ రతన్‌సింగ్‌నాయక్, బండారు ప్రసాద్‌లతో పాటు పార్టీ జిల్లా, నియోజకవర్గ, పట్టణ నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.


తప్పిపోయిన మహిళ అప్పగింత



మహిళను ఆమె సోదరుడికి అప్పగిస్తున్న ఏఎస్ఐ యాదగిరి

మాడుగులపల్లి : మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి తప్పిపోయిన మహిళను పోలీసులు చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలివి.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రానికి చెందిన పగిళ్ల ముత్తమ్మ (40) మతిస్థిమితం కోల్పోయింది. పదిరోజుల క్రితం ఇంటి నుంచి తప్పిపోయి మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామానికి చేరుకుంది. గ్రామశివారులోని వాగు వద్ద సంచరిస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ యాదగిరి, కానిస్టేబుల్ సుదర్శన్ ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి మాట్లాడించగా చారకొండ పేరు ప్రస్తావించింది. దాంతో అక్కడి పోలీస్ స్టేషన్‌కు ఆమె ఫోటోలను పంపారు. వారు స్థానికంగా, సామాజిక మాధ్యమాల్లో ఫోటోలను పంపి ఆరా తీసి చారకొండ వాసిగా గుర్తించారు. ముత్తమ్మ సోదరుడు అంజనేయులు శనివారం మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆమెను తీసుకెళ్లారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మతిస్థిమితం లేని మహిళను ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చిన పోలీసుల పని తీరును స్థానికులు ప్రశంసించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామస్వామి

దేవరకొండ : ప్రభుత్వ ఆస్పత్రి కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి కోరారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్‌కు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లేని పక్షంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్తారని ఆయన తెలిపారు. విపతిపత్రం అందజేసిన వారిలో మల్లయ్య, రామేశ్వరమ్మ, తారమ్మ, వెంకటయ్య, కాశయ్య, శ్రీను, సరిత తదితరులు పాల్గొన్నారు.